అన్నదాత సుఖీభవ

రైతు అభివృద్ధే
మన అభివృద్ధి

# ఆద్రిత

T MEDIA – TELUGU DIGITAL

తెలుగు రాష్ట్రాల రైతన్నల కోసం... రైతన్నల గొంతుక



రైతు బలం...
దేశం బలం

పంట పండే
భారతం
సంపన్న భారతం

వ్యవసాయ ప్రత్యేక సంచిక | సంఖ్య: 325 | 2026 సెప్టెంబర్ 22, మంగళవారం | పేజీలు: 8 | ధర: రూ. 5/-

# తెలంగాణలోని రైతులకు ప్రభుత్వం అలర్ట్ ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

## ఒకే రైతు – ఒకే గుర్తింపు – సమగ్ర సేవల కోసం కేంద్రం ఫార్మర్ రిజిస్ట్రీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (టీ మీడియా):**
రైతులకు తెలంగాణ ప్రభుత్వం బిగ్ అలర్ట్ జారీ చేసింది. రైతు రిజిస్ట్రేషన్ (ఫార్మర్ రిజిస్ట్రీ) తప్పనిసరిగా చేసుకోవాలని సూచించింది. ఒకే రైతు-ఒకే గుర్తింపు-సమగ్ర సేవలు కోసం కేంద్ర ప్రభుత్వం ఫార్మర్ రిజిస్ట్రీని ప్రవేశపెట్టింది. ఈ విధానంలో రైతులకు ఒక యూనిక్ ఐడీ కేటాయిస్తారు. ఈ ఐడీ ద్వారా రైతులు ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, రాయితీలు పొందవచ్చు. ప్రతి ఒక్క రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకుని ఐడీ పొందాలి. రైతులను సులువుగా గుర్తించేందుకు ఇది సహాయపడుతుంది. నిజమైన రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేందుకు ఉపయోగపడుతుంది. కేవలం ఆధార్, పట్టాదారు పాస్‌బుక్, మొబైల్ నంబర్ ఉంటే రిజిస్టర్ చేసుకోవచ్చు.




**సెప్టెంబర్ 22-30 వరకు ప్రత్యేక క్యాంపెయిన్లు**

### ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడం ఎలా?

సెప్టెంబర్ 22వ తేదీ నుంచి 30వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు గ్రామాల్లో రైతు రిజిస్ట్రేషన్ కోసం ప్రత్యేక క్యాంపెయిన్లు తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తోంది. దీంతో మీ గ్రామాల్లోకి అధికారులు వచ్చి రిజిస్ట్రేషన్ చేస్తారు. వారి దగ్గర మీరు ఈ ప్రక్రియ పూర్తి చేయవచ్చు. ఇక మండల పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారి (AEO) వద్ద లేదా మీ సేవలో నమోదు చేసుకోవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే నమోదు చేసుకున్నవారు మళ్లీ చేసుకోవాల్సిన అవసరం లేదు. రిజిస్టర్ చేసుకున్న తర్వాత ఐడీ నంబర్‌ను గుర్తు పెట్టుకోండి. పీఎం కిసాన్, రైతు భరోసా వంటి పథకాలు పొందేందుకు ఇది తప్పనిసరిగా అవసరం.

# తెలంగాణపై సూపర్ ఎల్‌నినో ప్రభావం

## వరి సాగు విస్తీర్ణం, దిగుబడులపై ఆందోళన




**హైదరాబాద్, సెప్టెంబర్ 22 (టీ మీడియా):**
తెలంగాణలో ప్రధాన ఆహార పంట వరిపై సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా చూపబోతోంది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వరి పంట, సాగు, విస్తీర్ణం దిగుబడులు గణనీయంగా తగ్గిపోతుండటం రైతుల్లో సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ శాఖలు, పౌరసరఫరాల శాఖ గణాంకాల ప్రకారం, గత సంవత్సరం వానాకాలంతో పోలిస్తే ఈసారి ఖరీఫ్ వరిసాగు విస్తీర్ణం 10 లక్షల ఎకరాలకుపైగా పడిపోయింది. 2025-26 ఖరీఫ్‌లో తెలంగాణ ఆల్‌టైం రికార్డుగా 67.57 లక్షల ఎకరాల్లో 148.3 లక్షల టన్నులు ఉత్పత్తి లభించింది. 2025-26 వానాకాలంలో 55 లక్షల 89 వేల 862 ఎకరాల్లో సాగైన, 119.57 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికాగ..నిరులు అంచనా వేశారు.

### భారీగా పడిపోనున్న దిగుబడులు

వాతావరణ మార్పుల నేపథ్యంలో తెలంగాణ వ్యవసాయ రంగంలో అనూహ్యమైన మార్పులు చోటు చేసుకున్నాయి. సూపర్ ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో లోటు వర్షపాతం కారణంగా వరి పంట సాగు విస్తీర్ణం అంచనాలు తలకిందులు చేస్తూ దిగుబడులు భారీగా పడిపోనున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాధారణ సాగు విస్తీర్ణం కోటి 32 లక్షల 38 వేల 446 ఎకరాలు నిర్దేశించగా, ప్రతికూల వాతావరణ పరిస్థితులు దృష్ట్యా కోటి 24 లక్షల 90 వేల 516 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతున్నాయి. అంటే ప్రభుత్వం, వ్యవసాయ శాఖ నిర్దేశించిన లక్ష్యంలో 94 శాతం మేర వ్యవసాయ పంటలు సాగవుతున్నాయి. గత ఏడాది వానాకాలంతో పోలిస్తే ఈ సీజన్‌లో 6 శాతం విస్తీర్ణం తగ్గిపోయింది.

# 50 ఏళ్లుగా వ్యవసాయం – ఇలాంటి కరవు ఎప్పుడూ చూడలేదంటున్న పల్నాడు రైతులు







**పల్నాడు, సెప్టెంబర్ 22 (టీ మీడియా):**
ఎల్‌నినో పడగ విప్పింది. వరుణుడి జాడ కనిపించడం లేదు. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. కాలువల నుంచి నీరు ఆశించలేని దుస్థితిలో పల్నాడు జిల్లా రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. పత్తి పండేలా కనిపించడం లేదు. మిరప వల్ల డబ్బు మిగిలే మాట అటు ఉంచితే, పెట్టుబడి కూడా వచ్చేలా లేదని ఆవేదన చెందుతున్నారు. ఎల్‌నినో సెగతో పల్నాడు జిల్లా రైతులు అల్లాడిపోతున్నారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులతో ఖరీఫ్ సాగు చాలా కష్టంగా సాగుతోంది. చాలా మంది మాగాణిలో వరి, మెట్ట భూముల్లో పత్తి, మిరప పంటలు వేశారు. లోటు వర్షపాతం, ఎండల తీవ్రత, భూగర్భ జలాల క్షీణత వల్ల వేలాది ఎకరాల్లో సాగు చేసిన పత్తి, మిరప పంటలు దారుణంగా తయారయ్యాయి.

### ఆశాజనకంగా లేని దిగుబడి

నీటి జాడ లేక పత్తి పంట నిలువునా ఎండిపోతుంది. సాధారణంగా పత్తి ఏపుగా పెరిగితే, ఎకరాకు 10 నుంచి 12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. కానీ ప్రస్తుతం పత్తి మొక్క మోకాళ్ల ఎత్తుకే పరిమితమైంది. దిగుబడి ఏమాత్రం ఆశాజనకంగా లేదు. పూత దశలోనే పూలు రాలిపోతున్నాయి. ఎకరాకు కనీసం 2 క్వింటాళ్లు పండే పరిస్థితి కూడా లేదని రైతులు చెబుతున్నారు. మరోవైపు తెల్ల దోమ, పేను బంక, తామర పురుగులు వంటి రసం పీల్చే పురుగులు పంటను చుట్టుముడుతున్నాయని రైతులు చెబుతున్నారు. అడపాదడపా వర్షాలు పడటంతో రైతులు ధైర్యం చేసి మిరప పంట వేశారు. ఆ తర్వాత వానల్లేక, బోర్లలో నీరు అడుగంటిపోవడం, గరిష్ట ఉష్ణోగ్రతల వల్ల మొక్కలు వాడిపోతున్నాయి. పెట్టుబడి భారీగా పెట్టామని, పంట చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

"రైతు ఉన్నాడు... కాబట్టే మనం ఉన్నాం"



నీరు... నేల... రైతు... మన భవిష్యత్తు

Follow Us :